క్లుప్తంగా

డాక్యుమెంటేషన్‌పై శిక్షణ



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ ఆంజనేయ

పాములపాడు: స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో మంగళవారం క్షేత్ర స్థాయి సిబ్బంది గ్రామ వ్యవసాయ సహాయకులు, ఎంపీఈఓలకు డాక్యుమెంటేషన్‌పై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ పరంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకంపై అవగాహన కలిగి ఉండాలని, రిజిస్టర్ మెయింటైన్ చేయాలని సూచించారు. అనంతరం పలు రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ ఫణీశ్వరరెడ్డి, ఏఈఓలు మద్దిలేటి, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న ఏపీఎన్‌జీవోఓ సంఘం కార్యదర్శి సాజిద్‌బాషా

ఆత్మకూరు : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని ఏపీఎన్‌జీఓ సంఘం జిల్లా కార్యదర్శి సాజిద్‌బాషా, ఉపాధ్యాయ సంఘం నాయకులు శంకర్, జేఏసీ చైర్మన్ మోహన్‌రెడ్డి కోరారు. పట్టణంలోని ఎన్‌జీఓ కార్యాలయంలో మంగళవారం ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిటీ ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి ఐఆర్ ప్రకటన చేయాలని, పీఎఫ్, సరెండర్ లీవ్‌ల బకాయిలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐఆర్ ప్రకటించాలి

నందికొట్కూరు: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్లకు ప్రభుత్వం వెంటనే ఐఆర్‌ను ప్రకటించాలని తాలుకా జేఏసీ చైర్మన్ రాముడు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఏపీ ఎన్‌జీఓ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్ల ఆర్థిక పరమైన డిమాండ్ పరిష్కారం కోసం ఈ నెల 13వ తేదీ నుంచి ఐక్య ఉద్యమం చేపడుతున్నామన్నారు. 12వ పీఆర్సీ కమిటీ ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి ఐఆర్ ప్రకటించాలని కోరారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీఓ సంఘం కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు రాజశేఖర్, సహాయ కార్యదర్శి వెంకటలత, సభ్యులు అనురాగ్, చెంచన్న తదితరులు పాల్గొన్నారు.

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామి వార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

అంగన్‌వాడీ హెల్పర్ మృతి



అంగన్‌వాడీ హెల్పర్ షంషూన్(ఫైల్)

పాములపాడు: మండలంలోని శాంతినిలయం గ్రామం అంగన్‌వాడీ సెంటర్ హెల్పర్ షంషూన్ (58) మంగళవారం గుండెనొప్పితో మృతి చెందింది. విషయం తెలుసుకున్న సూపర్‌వైజర్ లలిత ప్రభావతి, అంగన్‌వాడీ యూనియన్ లీడర్లు శివలక్ష్మి, శ్రీలతలు మృత దేహానికి పూల మాల వేసి నివాళ్లులర్పించారు. ఏసీడీపీఓ మంగవల్లి దహన సంస్కారాల నిమిత్తం సొంత ఖర్చులు రూ.2వేలు పంపించారు.

సున్నిపెంట సీఐగా రమేష్‌కుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ రమేష్‌కుమార్

శ్రీశైలంప్రాజెక్ట్: రాష్ట్రప్రభుత్వం నూతనంగా శ్రీశైలం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించింది. నంద్యాల డీసీఆర్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న జె.రమేష్‌కుమార్‌కు పదోన్నతి కల్పించి సీఐగా నియమిస్తూ ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు మంగళవారం ఆయన సున్నిపెంట పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో శ్రీశైలం వన్‌టౌన్ ఎస్‌ఐగా పనిచేశారు.

పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తే ధ్యేయం

- విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ప్రభుత్వం
- ప్రతిపక్షాల దుష్ప్రచారం సరికాదు
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్



హాజరైన విద్యార్థులు

నందికొట్కూరు: పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అల్వాల సత్రంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలేజ్ కెప్టెన్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చిన ఘనత సీఎం వైఎస్ జగనన్నకే దక్కిందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిషు మీడియం ప్రవేశపెట్టి పేద పిల్లలకు అందిస్తుంటే జగనన్న ప్రభుత్వంపై టీడీపీ, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని విద్యార్థులు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసి, పేద విద్యార్థులను విద్యకు దూరం చేయాలని కుట్రపన్నుతున్న టీడీపీకి గుణపాఠం చెప్పాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని పేద విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడాలనే ఉద్దేశంతో ఇంగ్లిషు మీడియం, ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీల ద్వారా డిజిటల్ పాఠాలు బోధించడం జరుగుతోందని స్పష్టం చేశారు.

ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేని పథకాలు

పేద విద్యార్థుల కోసం అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్య లాంటి పథకాలను జగనన్న ప్రభుత్వం అందిస్తోందని, ఇలాంటి పథకాలు ఏ రాష్ట్రంలో కూడా లేవన్నారు. సీఎం వైఎస్ జగనన్న పేదలకు సంక్షేమ పథకాలు అందించేందుకు 124 సార్లు బటన్ నొక్కారని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగనన్న అందించిన సంక్షేమ పథకాలు గుర్తు చేసి జగనన్నను ఆశీర్వదించమని తల్లిదండ్రులకు చెప్పాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ మాధురి, జిల్లా అధ్యక్షుడు సురేష్‌యాదవ్, నాయకులు తిరుమలేష్ యాదవ్, రాకిల్, దిలీప్, బాలు, సతీష్, అశోక్, రంగ, పార్టీ నాయకులు పుల్యాల నాగిరెడ్డి, జబ్బార్, అబుబక్కర్, రమేష్‌నాయుడు, ఉస్మాన్‌బేగ్, ఆర్ట్స్ శ్రీను, లడ్డూ పాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలవాలి



పగిడ్యాలలో కార్యకర్తలతో మాట్లాడుతున్న డాక్టర్ దారా సుధీర్

పగిడ్యాల: నందికొట్కూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ సుధీర్ దారా మంగళవారం మండలంలోని సంకిరేణిపల్లె, బీరవోలు, ఆంజనేయనగర్, పగిడ్యాల, లక్ష్మాపురం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఆయనకు ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, జెడ్పీటీసీ పుల్యాల దివ్య, వైస్ ఎంపీపీ పల్లె అరుణమ్మ, ఎంపీటీసీ మిద్దె స్వాములు, సర్పంచ్‌లు పెరుమాళ్ల శేషన్న, యర్రం ప్రభాకర్‌రెడ్డి, సుజాత, ఉపసర్పంచ్ షాజహా బేగం అపూర్వ స్వాగతం పలికారు. గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామ నాయకులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడానికి అండగా నిలవాలని కార్యకర్తలను కోరారు. నవరత్నాలు పథకం కింద ప్రతి కుటుంబానికి ఆర్థిక లబ్ధి చేకూరిందని, వాటి ప్రాముఖ్యతను క్షేత్రస్థాయిలోని కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. టీడీపీ మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తోందని, చంద్రబాబు మోసాన్ని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం అంబేడ్కర్ కాలనీలో ఉన్నా అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు అందించే సేవలపై విచారించి పిల్లలతో సంభాషించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, సింగిల్‌విండో చైర్మన్ గణపురం శ్రీనివాసరెడ్డి, నాయకులు పల్లె సత్యనారాయణరెడ్డి, నాగశేనారెడ్డి, మురళి, భూషిరెడ్డి, నారాయణ, దివాన్‌సాహెబ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మిడుతూరు: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ జగన్‌మోహన్ అన్నారు. మంగళవారం స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలు నడిపే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం అనుమతి పత్రాలు, లైసెన్స్ లేనివారికి జరిమానా విధించినట్లు తెలిపారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు : ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకురాలు భారతి, సుజాత కోరారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం వైద్యాధికారి సాజియాకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమకు వేతనాలు పెంచాలని, టీఏ, డీఏలు అదనంగా మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆశా సంఘం నాయకురాలు పాల్గొన్నారు.

ఈ నెల 14న ఓంకారంలో బహిరంగ వేలాలు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఓంకారం ఆలయంలో ఈ నెల 14వ తేదీన బహిరంగ వేలాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ నాగప్రసాద్ మంగళవారం తెలిపారు. ఆలయానికి వచ్చిన భక్తులు పాదరక్షలు భద్రపరచుకునేందుకు, టెంకాయల విక్రయానికి, ఐస్ క్రీమ్ బండ్లు పెట్టుకునేందుకు, కూల్ డ్రింక్స్ అమ్మకానికి వేలాలు ఉంటాయని పేర్కొన్నారు. వేలాల్లో పాల్గొనాల్సిన వారు రూ.10,000 డిపాజిట్లు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ప్రజలందరికీ మెరుగైన వైద్యం



వేంపెంటలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



శివపురంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ జవహర్ బాబు

పాములపాడు: ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని డాక్టర్ గులాబ్‌షా అన్నారు. మంగళవారం మండలంలోని వేంపెంట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ గులాబ్‌షా మాట్లాడుతూ గ్రామాలకు ప్రత్యేక వైద్య నిపుణులు వచ్చి ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారని చెప్పారు. రోగ తీవ్రత అధికంగా ఉన్న వారికి మెరుగైన వైద్యం కోసం పట్టణాలకు రెఫర్ చేసి రూపాయి ఖర్చు లేకుండా వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ ద్వారా చికిత్సలు అందించడం జరుగుతుందని వివరించారు. ప్రత్యేక వైద్యులు పూర్ణేశ్వరరావు, రాంబాబులు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మద్దయ్య, సీహెచ్‌ఓ అన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం

నందికొట్కూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాలలోని పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిచడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, సర్పంచ్ జనార్దన్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని శాతనకోట గ్రామంలో అధికారులు రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. గ్రామంలోని 410 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యురాలు, తులసీరాణి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

శివపురంలో జగనన్న ఆరోగ్య శిబిరం

కొత్తపల్లి: గ్రామీణ ప్రాంతాలకు సైతం మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీడీఓ జవహర్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని గోకవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని శివపురం గ్రామంలో సచివాలయం వద్ద రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును వైద్యుడు విజయేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. క్యాంపులో 320 మంది వైద్యపరీక్షలు చేయించుకోగా, 20 మందిని శస్త్ర చికిత్సల కోసం జిల్లా వైద్యశాలకు రేఫర్ చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, టీబీ సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్, కంటివైద్య నిపుణుడు షేక్షావలి పాల్గొన్నారు.

మిడుతూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో గ్రామీణులకు మెరుగైన వైద్యం అందుతుందని ఎంపీడీఓ గంగావతి అన్నారు. మండలపరిధిలోని అలగనూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సర్పంచ్ కృష్ణవేణి ఆధ్యక్షతన నిర్వహించారు. శిబిరంలో 532 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి కిరణ్, పంచాయతీ కార్యదర్శులు విజయకుమారి, అనురాధ పాల్గొన్నారు.

పేదలకు వరం ఆరోగ్య సురక్ష

మహానంది: జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజల ఆరోగ్యానికి వరమని ఎంపీడీఓ శివనాగజ్యోతి అన్నారు. సీతారామాపురం గ్రామంలో మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు శాంతిప్రియ, దినేషరెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు.

'పది' పరీక్షా కేంద్రాల పరిశీలన



ఎంఈఓ, హెచ్‌ఎంలతో మాట్లాడుతున్న డీఈఓ

మహానంది: పదోతరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని నంద్యాల డీఈఓ సుధాకర్ రెడ్డి సూచించారు. మండలంలోని తిమ్మాపురం ఏపీ మోడల్ స్కూల్‌తో పాటు జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు ఈ రెండు కేంద్రాల్లో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయన్నారు. అందులో భాగంగానే పరిశీలించామన్నారు. మండల విద్యాశాఖాధికారి రామసుబ్బయ్య, ప్రధానోపాధ్యాయులతో వివిధ అంశాలపై చర్చించారు.

అవి-ఇవి

పట్టణ ఎస్‌ఐల బదిలీ

నందికొట్కూరు: పట్టణ ఎస్‌ఐలు హుసేన్‌బాషా, సురేష్ మంగళవారం అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. వీరు అనంతపురం జిల్లా కేంద్రంలోని రేంజ్ కార్యాలయంలో రిపోర్టు చేసుకోనున్నారు. వీరిద్దరు ఇటీవల బదిలీపై ఇక్కడికి వచ్చారు. సొంత జిల్లా కావడంతో 2024 సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా వారిని ఉన్నతాధికారులు బదిలీ చేశారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదు, ఇంటర్ తరగతుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రామ్మూర్తి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024–25 ఏడాదికిగాను పాఠశాలలోని ఐదో తరగతిలో 80 సీట్లు, ఇంటర్ ఎంపీసీలో 40, బైపీసీలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3, 4 తరగతులు చదివిన విద్యార్థులు ఐదోతరగతి ప్రవేశానికి అర్హులన్నారు. ప్రస్తుతం పదోతరగతి చదువుతున్న విద్యార్థులు ఇంటర్ ప్రథమ ఏడాదిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

ఆశవర్కర్లకు కనీసవేతనం ఇవ్వాలి

జూపాడుబంగ్లా: ఆశవర్కర్లకు కనీసవేతనం మంజూరు చేయాలని మంగళవారం ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆశవర్కర్ల మండల అధ్యక్షురాలు భారతి, రసూల్‌బీ మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను లెక్కచేయకుండా ఆశవర్కర్లు విధులు నిర్వర్తించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఆశవర్కర్లకు మెరుగైన వేతనాలు మంజూరు చేస్తుండగా, ఏపీలో సరైన వేతనాలు మంజూరు చేయకపోవటం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు పార్వతి, రాములమ్మ, శ్యామలమ్మ, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలపై భయాందోళనకు గురి కావద్దు

ఆత్మకూరు : 10వ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలపై భయాందోళనకు గురి కావద్దని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని వివిధ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు థెరిస్సా, ఆదిత్య జూనియర్ కళాశాలలో పరీక్షలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలపై భయం వీడాలని, పబ్లిక్ పరీక్షల టైంటేబుల్ విధానంతో క్రమశిక్షణతో చదువుకొని ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ప్రేమ్‌కుమార్, సలీమ్, రవి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలను పరిరక్షించాలి

వెలుగోడు: శాంతిభద్రతల పరిరక్షణలో గ్రామస్తులు భాగస్వాములు కావాలని ఎస్‌ఐ భూపాలుడు కోరారు. మంగళవారం రాత్రి గుంతకందాల గ్రామంలో ఎస్‌ఐ భూపాలుడు గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల దృష్ట్యా గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడినా, అనుమానాస్పదంగా ఎవరైనా కనిపించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే పట్టణ శివారులోని వేంపెంట రస్తాలో ఎస్‌ఐ భూపాలుడు వాహనాలు తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో 11 మందికి రూ.1,485 జరిమానా విధించారు.

ప్రతి ఒక్కరికీ సరుకులు అందజేయండి

జూపాడుబంగ్లా: ఎండీయూ వాహనాల దారులు ప్రతి రేషన్‌కార్డుదారునికి నిత్యావసర సరుకులు అందజేయాలని సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ నాగన్న తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా 11,864 రేషన్‌కార్డులుండగా వారికి మంజూరైన నిత్యావసర సరుకులను 28 మంది డీలర్ల ద్వారా మండలం వ్యాప్తంగా 8 వాహనాల్లో ప్రజలకు ఇంటింటికీ పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఫిబ్రవరి మాసానికిగాను బియ్యం 3,272 క్వింటాళ్లు, కందిపప్పు 118.64 క్వింటాళ్లు, చక్కెర 59.32 క్వింటాళ్లు, జొన్నలు 118.64 క్వింటాళ్లు, రాగులు 118.64 క్వింటాళ్ల చొప్పున రేషన్ దుకాణాలకు సరుకులు మంజూరైనట్లు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రజలు ఎండీయూ వాహనాల ద్వారా అందించే నిత్యావసర సరుకులను ఆయా గ్రామాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సరుకులు అందలేదని ఎవరైనా ఫిర్యాదుచేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

పశుగ్రాసం దగ్ధం

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని పగిడ్యాల దేవనగర్ కాలనీకి చెందిన మద్దూరు బుజ్జన్నకు చెందిన పశుగ్రాసం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మంగళవారం దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడం వల్ల కళ్లంలోని మూడెకరాల వరిగడ్డి, మినుము పొట్టు, జొన్న సొప్ప, కంది పొట్టు పూర్తిగా కాలిపోయింది. గమనించిన స్థానికులు కర్నూలు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక కేంద్రం హెడ్ కానిస్టేబుల్ నరసింహ హుటాహుటిన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.1.20 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

రిజిస్ట్రేషన్‌తో శాశ్వత హక్కు

పాములపాడు: రిజిస్ట్రేషన్లతో జగనన్న ఇళ్ల స్థలాలపై శాశ్వత హక్కు పొందుతారని ఈఓపీఆర్డీ శ్రీనివాసులు నాయుడు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లోని సచివాయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ శరవేగంగా సాగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నవరాత్నాల్లో భాగంగా పేదలకు జగనన్న కాలనీల్లో స్థలాలు పంపిణీ, చేసి పక్కా గృహాలు మంజూరు చేసిందన్నారు. మండలంలో మొత్తం 2,051 మంది లబ్ధిదారులుండగా, ప్రస్తుతం 503 మంది రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని తెలిపారు.

ధర్మకర్తల మండలి నియామకం

కొత్తపల్లి: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కొలనుభారతి దేవి ఆలయ నూతన ధర్మకర్తల మండలి నియామకం జరిగినట్లు ఆలయ ఈఓ మోహన్, జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డిలు మంగళవారం తెలిపారు. ఆలయ చైర్మన్‌గా బోయ వెంకట నాయుడు, సభ్యులుగా నేనవత్ శివమ్మ బాయి, వై వెంకటేష్, పుల్యాల చంద్ర కళావతమ్మ, మలిరెడ్డి సునీత, జీ మణికంటేష్, సోమల రామిరెడ్డిలను నియమిస్తూ దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చాయని చెప్పారు. వీరికి బుధవారం ఆలయ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు, ప్రజలు, నాయకులు, ప్రజాప్రతినిధులు ఈ ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

203 మద్యం బాటిళ్లు స్వాధీనం

మహానంది: మహానంది మండలం అబ్బీపురం గ్రామంలో సెబ్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. సెబ్ ఈఎస్ రామ్మోహన్ ఆదేశాల మేరకు సెబ్ ఇన్‌స్పెక్టర్ జి.విశ్వనాథరెడ్డి, సిబ్బంది దాడులు చేసి 203 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అబ్బీపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వర రెడ్డి నుంచి 28 బాటిల్లు, బండి ఆత్మకూరు మండలం కోడూరు గ్రామానికి చెందిన బాలుడు వద్ద 175 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

టీడీపీకి ఇవే చివరి ఎన్నికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులతో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

- శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన 40 కుటుంబాలు

నందికొట్కూరు: టీడీపీకి చివరి ఎన్నికలు ఇవేనని శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆయన స్వగృహంలో నందికొట్కూరు మండలం శాతనకోట గ్రామ సర్పంచు (వైఎస్సార్‌సీపీ) జనార్దన్‌గౌడు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు తెలుగు స్వాములు, నారాయణ, బోయ ఆంజనేయులు, రఫి, ఫయాజ్, బోయ వెంకటయ్య,. కమతం మధు, సయ్యద్, చంద్రమౌళి, బాషా, బింగి సురేష్, మేకల కృష్ణ, మంగలపల్లి మద్దిలేటి, అల్వాల సురేష్‌తో పాటు 40 కుటుంబాలు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రజలకు మోసం చేస్తే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క పైసా లంచం, వివక్ష లేకుండా సంక్షేమ పథకాలు అందించారన్నారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ప్రజలకు ఏమి చేశారో చెప్పి ఓటు అడగలేని పరిస్థితిలో ఉన్నారని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేని ఆయనకు ఓటు అడిగే హక్కు లేదని తేల్చి చెప్పారు. ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సంసిద్ధంగా ఉండాలి



పోలింగ్ స్టేషన్ల వివరాలు పరిశీలిస్తున్న ఆర్డీఓ దాస్

కొత్తపల్లి: అధికారులందరూ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సంసిద్ధంగా ఉండాలని ఆత్మకూరు ఆర్డీఓ దాస్ సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల సమయం ఆసన్నమైందని, అధికారులు ఎన్నికల విధులకు సిద్ధంగా ఉండాలన్నారు. మండలంలో 37 పోలీంగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటిలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని పోలీంగ్ కేంద్రాలలో మౌలిక వసతులు ఉండేలా చూడాలన్నారు. అనంతరం జగనన్న ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను తనిఖీ చేశారు. మండలంలో సాంకేతిక లోపాల కారణంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాగడం లేదని సిబ్బంది తెలపడంతో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తిరుపతయ్య, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న ఉన్నారు.

జాగ్రత్తలతోనే నులిపురుగుల నివారణ



నులిపురుగుల నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్యుడు

కొత్తపల్లి: మనం తీసుకునే జాగ్రత్తలతోనే నులిపురుగుల నివారణ సాధ్యమవుతుందని వైద్యుడు ఎం.ఎం.బేగ్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో నులిపురుగుల నివారణ వారోత్సవాలపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 19 సంవత్సరాల వరకు గల బాల, బాలికలకు ఈనెల 9 నుంచి అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తారన్నారు. చేతుల పరిశుభ్రతపై పిల్లలకు తెలియజేయాలన్నారు. మధ్యాహ్న భోజనం తర్వాత మాత్రలను చప్పరించి మింగించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బాలకృష్ణయ్య, పీహెచ్ ఎన్ ఆయేషాబేగం తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి

మహానంది: ఈ నెల 9వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా చిన్నారులు, విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేయించాలని బండిఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి భావన తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఆశాడే కార్యక్రమం నిర్వహించారు.

సమయపాలన పాటించాలి

మహానంది: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని బండిఆత్మకూరు ఎంపీడీఓ విజయరావు అన్నారు. బండిఆత్మకూరు మండలంలోని శింగవరం, ఈర్నపాడు గ్రామాల్లోని సచివాలయాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమయానికి విధులకు హాజరవ్వాలని కోరారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి ప్రొగ్రెస్ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈఓఆర్డీ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

నందికొట్కూరు తహసీల్దార్‌గా దామోదర్‌రెడ్డి



తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన దామోదర్‌రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న గురప్ప

నందికొట్కూరు రూరల్ : నందికొట్కూరు తహసీల్దార్‌గా దామోదర్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ ఎన్నికల బదిలీల్లో భాగంగా డోన్‌కు వెళ్లగా ఆయన స్థానంలో వైఎస్సార్ జిల్లా గోపవరం మండలం నుంచి దామోదర్‌రెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు.

శ్రీశైలం తహసీల్దార్‌గా గురప్ప

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండల నూతన తహసీల్దార్‌గా బి.గురప్ప మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ బి.రాజేంద్రసింగ్‌ను ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం బదిలీ చేసింది. కార్యాలయ సిబ్బంది రాజేంద్రసింగ్‌కు వీడ్కోలు, గురప్పకు స్వాగతం పలికారు.